
సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



నేటి నుంచి కుంభాభిషేకం
రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయ పశ్చిమ రాజ గోపుర కుంభాభిషేకం, సాలహార మహోత్సవాలు నేటి నుంచి జరగనున్నాయి. -8లో



రూ.150 కోట్లు ఇస్తే ఆస్తులు రాసిస్తా
కేవలం రూ.150 కోట్లు ఇస్తే తన ఆస్తులను రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. -8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.3/24.6
జిల్లాలో గురువారం 24.6 - 32.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

10న చెస్ టోర్నీ
కడప స్పోర్ట్స్: కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 10వ తేదీ ఆదివారం ఉదయం జిల్లాస్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్ దర్బారీ తెలిపారు. మొదటి 5 స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు, 10 స్థానాల్లో నిలిచిన వారికి ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8341255151 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు హెచ్‌సీల సస్పెన్షన్
కొండాపురం: కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు సుధా ప్రసాద్, వర ప్రసాద్‌ల సస్పెండ్ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ కౌశల్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీరిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

పథకాల అమలుపై శిక్షణ
కడప రూరల్: ఆరోగ్య పథకాలను పక్కాగా అమలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో డివిజన్ల వారీగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందికి హెల్త్ మేనేజ్‌మెంట్ సమాచార వ్యవస్థ , ఆరోగ్య పథకాల సేవల అమలుపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ శిక్షణ 18వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


డీఎస్‌డీఓగా బాధ్యతలు చేపట్టిన అమృత్‌రాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కోచ్‌లు


కడప స్పోర్ట్స్: జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ)గా ఎస్.వి.పి.అమృత్‌రాజ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు స్టెప్, డీఎస్‌ఏలు ఒకేశాఖగా కొనసాగగా.. ఇటీవలే స్టెప్‌ను, డీఎస్‌ఏను విభజిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. దీంతో డీఎస్‌ఏ చీఫ్ కోచ్‌గా ఉన్న పోస్టును డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్నతీకరించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో డీఎస్‌డీఓగా బాధ్యతలు చేపట్టారు. కాగా ఈయన డీఎస్‌ఏలో ఫుట్‌బాల్ శిక్షకుడుగా ప్రస్థానం ప్రారంభించారు. ఇప్పటి వరకు చీఫ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. తాజా నిర్ణయంతో డీఎస్‌డీఓగా బాధ్యతలు చేపట్టారు కార్యక్రమంలో కోచ్‌లు సుదర్శన్, సిద్ధిఖ్, అబ్దుల్ మునాఫ్, శ్రీనివాసరాజు, కల్యాణ్, విలియం కేరీ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించండి
కడప అర్బన్: ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో దొంగతనాలు జరగకుండా వుండేందుకు అన్ని సబ్ డివిజన్ కమాండ్ కంట్రోల్ కేంద్రాల్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు అందుబాటులో వున్నాయని,, బ్లూకోల్ట్ రక్షక్ బృందాల సాయంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

10న గీతా శ్లోకాల పోటీ
కడప కల్చరల్ : తిరుమల-తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన భగవద్గీతలోని శ్లోకాల పఠన పోటీ నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు తెలిపారు. గురువారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు చెందిన విద్యార్థులకు ఆదివారం కడప నగర పరిధిలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో ఈ పోటీ నిర్వహిస్తారన్నారు. 6వ తరగతి విద్యార్థులు జూనియర్‌లుగా.. 8, 9 తరగతుల వారు సీనియర్లుగా ఈ పోటీలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా భగవద్గీత మూడో అధ్యాయం కర్మయోగంపై శ్లోకాల కంఠస్థ పోటీ ఉంటుందన్నారు. దాంతోపాటు సంపూర్ణ భగవద్గీతపై 18 సంవత్సరాలలోపు విద్యార్థులు సీనియర్లుగా, ఆపై వయస్సువారు సీనియర్లుగా 700 శ్లోకాలు అప్పజెప్పే పోటీ ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లాకు చెందిన విద్యార్థులకు 17న ఆదివారం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీ ఉంటుందన్నారు. ఇరు జిల్లాల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విభాగాల వారీగా అందజేస్తామన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు బెస్త వేముల రామమహేష్, విజయ్ భట్టర్, ఏటూరి రామచంద్రారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన

- సామాజిక న్యాయం, సాధికారతే లక్ష్యం
- స్వాతంత్ర్యానంతరం ఇదే ప్రథమం
- 10వ తేదీ నుంచి ప్రారంభం



కడప సెవెన్‌రోడ్స్: సమాజంలో వెనుకబడిన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు మెరుగైన విధాన రూపకల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన-2023 అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతోంది. 92 సంవత్సరాల తర్వాత చేపడుతున్న ఈ కార్యక్రమం మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ విధానంలో జరిగే ఈ సర్వే కోసం ప్రత్యేకంగా ఒక మొబైల్ అప్లికేషన్ రూపొందించారు. గ్రామ/వార్డు సచివాలయశాఖ నోడల్ డిపార్ట్‌మెంటుగా వ్యవహరిస్తుంది. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎన్యుమరేషన్ సవ్యంగా సాగేందుకు వీలుగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు.

ఇదీ నేపథ్యం
దేశంలో 1872లో మొదటిసారి కులగణన నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వివిధ సమయాల్లో అది జరిగింది. జిల్లాలో మాత్రం 1871లోనే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించారు. ఆనాటి జిల్లా మొత్తం జనాభా 1,35,1,194. ఇందులో హిందూమతంలోని వివిధ కులాల వారీగా మొత్తం 1,24,2,317 మంది ఉన్నారు. ముస్లిం జనాభా 1,03,676 కాగా, ఇందులో సున్నీలు 94137 (90.8 నిష్పత్తి), షియాలు 5047 (4.9) వహాబీలు 4 (0.004), ఇతరులు 4488 (4.3) మంది ఉన్నారు. అలాగే బౌద్ధులు/జైనులు నలుగురు మాత్రమే ఉన్నారు. క్రైస్తవులు 4973 మంది ఉండగా, అందులో రోమన్ క్యాథలిక్స్ 877, ప్రొటెస్టియన్స్ 4096 మంది ఉన్నారు. కాగా ఇతరులు కేటగిరిలో 224 మంది ఉన్నారు. 1881 నుంచి పది సంవత్సరాలకు ఒకసారి దేశమంతటా సెన్సెస్ ఆపరేషన్స్ జరుగుతున్నాయి. చివరిసారిగా 1931లో క్యాస్ట్ ఎన్యుమరేషన్ జరిగింది. జనాభా సాధారణ పెరుగుదల రేటు అనుసరించి బీసీ జనాభా ఇంతమంది ఉన్నారని చెబుతున్నారే తప్ప అందులోని కులాలవారీగా గణాంకాలు లేవు. ఇందువల్ల వివిధ రకాలుగా వారు నష్ట పోవాల్సి వస్తోంది. దీన్ని సరిదిద్ది సామాజిక న్యాయం, సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం క్యాస్ట్ ఎన్యుమరేషన్‌కు సిద్ధమైంది.

సర్వే ఉద్దేశ్యం
మనది నిచ్చెనమెట్ల సమాజం. కొన్ని కులాలు బాగా అభివృద్ధి చెందగా, మరికొన్ని వెనుకబడి ఉన్నాయి. సమాజంలో వివిధ రంగాల్లో వెనుకబడిన కులాలను గుర్తించి వారి అభివృద్ధికి ప్రత్యేక పథకాలు, ముఖ్యంగా సంక్షేమ పథకాలు అందించాలన్నది ప్రభుత్వ సర్వే ఉద్దేశ్యం. ఇందుకోసం ఇప్పుడున్న వాటి కంటే మెరుగైన విధానాలు రూపకల్పన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జనాభా ఆధారంగా ఆయా జిల్లాలకు నిర్దిష్టంగా కొన్ని పథకాలు అందించేందుకు ప్రణాళికలు రచించనున్నారు. అందుకే సామాజిక, ఆర్థిక, విద్య, జీవనోపాధి వంటి అంశాల ఆధారంగా సమగ్ర కుల గణన చేపడుతున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ప్రతినిధులు చాలా కాలంగా కుల గణన నిర్వహించాలని కోరుతున్నా ఇంతవరకు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతను నెత్తికెత్తుకుంది. ఈ నేపథ్యంలో ఇటీవల బీహార్‌లో కుల గణన నిర్వహించడంతో ఇక్కడి సీనియర్ ఐఏఎస్ అధికారుల బృందాన్ని ఆ రాష్ట్రానికి పంపి అధ్యయనం చేయించారు.

సర్వేలో సేకరించే అంశాలు
కుటుంబ సభ్యుల వివరాలు, యజమాని ఆధార్, బియ్యం కార్డు నంబరు, ఇంటి రకం, తాగునీరు, టాయిలెట్లు, వంట గ్యాస్, పశు సంపద, మతం, కులం, ఉప కులం, పుట్టిన తేది, వివాహ స్థితి, విద్యార్హత, వృత్తి, పంట భూమి, నివాస భూమి, ఆదాయం వంటి వివరాలు సేకరిస్తారు.

అధికార బృందాల ఏర్పాటు
జిల్లాలో కులగణన సవ్యంగా జరిగేందుకు వీలుగా వివిధ స్థాయిల్లో అధికారులతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో జేసీ, సీపీఓ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, సాంఘిక సంక్షేమశాఖ జేడీ, బీసీ వెల్ఫేర్ అధికారి, గిరిజన సంక్షేమాధికారి, మైనార్టీ సంక్షేమాధికారి ఉంటారు. డివిజనల్ స్థాయిలో ఆర్డీఓ, డీఎల్‌డీఓ, డీఎల్‌పీఓ, సంక్షేమ శాఖలకు చెందిన అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారులు ఉంటారు. మండల/మున్సిపల్ స్థాయిలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి ఉంటారు. వీరు కాకుండా జిల్లాలో బీసీ వెల్ఫేర్ అధికారి, సాంఘిక సంక్షేమ అధికారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, మైనార్టీ వెల్ఫేర్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు.

సర్వే ఇలా..



గ్రామ/వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారు. వారం లేదా పది రోజుల్లోనే ఈ సర్వే పూర్తి కానుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థ రాష్ట్రంలో ఉండటమే ఇందుకు కారణం. ఎన్యుమరేషన్ కోసం ప్రత్యేక యాప్ రూపొందించారు. సమాచార సేకరణకు సంబంధిత డాక్యుమెంట్లు చూపాలని అడగరు. గతంలోని డేటా బేస్‌లో లేని కొత్త వారిని ఇందులో కవర్ చేస్తారు. ఒక ఇంటి వద్ద సర్వే పూర్తయ్యాక వలంటీర్, సచివాలయ ఉద్యోగి ఈకేవైసీ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఆయా కుటుంబ సభ్యులు కూడా ఈకేవైసీ నిర్వహించినపుడే హౌస్‌హోల్డ్ సర్వే పూర్తయినట్లు లెక్క. కుటుంబంలోని ఎనిమిదేళ్ల లోపు పిల్లల ఈకేవైసీ అవసరం లేదు.

అపోహలు అవసరం లేదు



కులాల సమగ్ర స్థితిగతులను తెలుసుకుని అందుకు అనుగుణంగా పాలసీలు తయారు చేసేందుకే సర్వే నిర్వహిస్తున్నాం. సర్వేలో సేకరించిన సమాచారం ఆధారంగా కుల ధృవీకరణ పత్రాల జారీ ఉండదు. ఎవరూ అపోహలకు గురికాకుండా కులగణన సజావుగా సాగేందుకు సహకరించాలి.
– వెంకట్రావు,జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, కడప

రాజంపేటలో రంగమ్మత్త సందడి



ఎంజీఆర్ మాల్ ప్రారంభానికి వచ్చిన అనసూయ

రాజంపేట: రాజంపేట పట్టణంలో సినీనటి అనసూయ భరద్వాజ సందడి చేశారు. తిరుపతి రహదారిలోని చెన్నై ఎంజీఆర్‌మాల్‌ను ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమానికి రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కమిషనరు జనార్దన్‌రెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని చూసేందుకు రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి యువత పెద్దఎత్తున వచ్చారు. అనంతరం మీడియాతో అనసూయ మాట్లాడుతూ రాజంపేటలో ఎంజీఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి రావడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఎంజీఆర్‌మాల్ అధినేత గిరిధర్ మాట్లాడుతూ మధ్యతరగతికి కుటుంబానికి సరసమైన ధరల్లో నాణ్యమైన దుస్తులను అందచేయడమే తమ లక్ష్యమన్నారు.



మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఆటోల పంపిణీలో కలెక్టర్



ఆటోలకు జెండా ఊపుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. కడప కలెక్టరేట్‌లో 11 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన మహిళా శక్తి ఆటోలను కలెక్టర్ గురువారం పంపిణీ చేశారు. ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు. ఉన్నతి-మహిళా శక్తి పథకం కింద ఎస్సీ, ఎస్టీ నిరుపేద మహిళలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి వడ్డీలేని రుణాల ద్వారా మంజూరైన ఈ ఆటోలను పంపిణీ చేశామన్నారు. ఈ పథకం ద్వారా పది శాతం లబ్ధిదారు వాటా చెల్లించగా, 90 శాతం వడ్డీలేని రుణాన్ని ప్రభుత్వం బ్యాంకుల సహకారంతో అందిస్తోందన్నారు. రుణాన్ని 48 కంతుల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ ప్రసాద్, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, ఏరియా కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సైనికుల సేవలు వెలకట్టలేనివి



తొలి విరాళం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు

వైవీయూ : దేశరక్షణలో ప్రాణాలను సైతం లెక్క చేయని సాయుధ దళాల సైనికుల సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. గురువారం సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల నిధికి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కలెక్టర్ మొదటి విరాళం అందజేసి.. సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశరక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీరజవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విరాళాలు ఇవ్వడం ఒక సేవగా భావించి ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇస్తోందన్నారు. జిల్లా ప్రజలు సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు అందించాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, ఇతర అధికారులు తమవంతుగా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి ఐజే రఘురామయ్య, సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు కె.వి.రావు, 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు సమయ్‌సింగ్, నాగరాజు, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

పట్టణాలకు నందనవనం

అరుదైన వృక్షాలు..పక్షుల కిలకిల రావాలు. వన్యప్రాణుల కేరింతలు..ఇలాంటి ప్రకృతి రమణీయ దృశ్యాలను పచ్చికబయలులో కూర్చొని చూడాలని అందరికీ ఉంటుంది. కానీ ఉరుకుల పరుగుల జీవితం గడిపే పట్టణవాసికి అలాంటి అవకాశం తక్కువ. వీరికి ఆహ్లాదం పంచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగరవనాలను అన్నమయ్య జిల్లాలో పలుచోట్ల ఏర్పాటు చేస్తోంది.

- అన్నమయ్య జిల్లాలో నగరవనాల ఏర్పాటు
- ఆరున్నరకోటి వ్యయంతో నిర్మాణం
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



నగరవనం నమూనా

రాజంపేట: ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం నగరవనాలను ఏర్పాటుచేస్తోంది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అన్నమయ్య జిల్లాలో నాలుగుచోట్ల నగరవనాలకు రూపకల్పన చేస్తోంది. పట్టణ శివార్లలో అటవీ ప్రాంతంలో అటవీ అందాలు తిలకించే విధంగా ఇవి రూపుదిద్దుకుంటున్నాయి. దీనికి సంబంధించి నిర్మాణపనులు శరవేగంతో జరుగుతున్నాయి. ప్రకృతి అందాలు కనువిందుచేయనున్నాయి.

రోజంతా ఉల్లాసం..
నగరవనాలు ఏర్పాటైతే పిల్లలు, పెద్దలు అనే తేడాలేకుండా రోజంతా అక్కడ ఉల్లాసంగా గడపవచ్చు. ట్రెక్కింగ్, బోటింగ్, వాకింగ్ ట్రాక్, వన్యప్రాణాలను విశిష్టతను వివరించే విజ్ఞాన కేంద్రాలు, ఎన్నో రకాల పక్షుల బొమ్మలు, వాచ్‌టవర్, వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. అలసిపోతే సేదతీరేందుకు అక్కడక్కడ పుట్టగొడుగుల ఆకారంలో ఉండే పగోడాలు, కుటుంబ సభ్యులు భోజనం చేసేందుకు క్యాంటీన్, పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కులు, ఆటవస్తులు ఏర్పాటు చేయనున్నారు. నామమాత్రపు ఫీజు (పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20)తో ప్రవేశించి నగరవనంలో అటవీఅందాలనీ కళ్లారా వీక్షించవచ్చు. అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట , రైల్వేకోడూరు, మదనపల్లె పట్టణాలకు సమీపంలో నగరవనాలు అందుబాటులోకి రానున్నాయి.

వనాల్లో పవిత్ర వృక్షాలు



నగరవనాల్లో కేవలం ప్రకృతి అందాలకే పరిమితం చేయడంలేదు. పవిత్ర వృక్షాలును ఏర్పాటు చేస్తున్నారు. సంప్రదాయబద్ధంగా కావాల్సిన మొక్కలను పెంచనున్నారు. వివిధ దేవతామూర్తుల పేరిట వెలసిన మొక్కలు, పూలను కూడా ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

పట్టణానికి దగ్గరగా నగరవనాలు..

పట్టణం	దూరం (కి.మీ)	వ్యయం (రూ.లలో)
రాయచోటి	1.50	2కోట్లు
రాజంపేట	6.50	2కోట్లు
మదనపల్లె	టౌన్	2కోట్లు
రైల్వేకోడూరు	1.50	50లక్షలు



ఆహ్లాదం పంచడమే లక్ష్యం



ప్రజలకు అటవీ అందాల ఆహ్లాదం పంచడమే నగవనాల నిర్మిత లక్ష్యం. ప్రకృతిని కాపాడుకోవడం. అడవులపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వం నగరవనాల నిర్మాణానికి ఆరున్నర కోటి నిధులను విడుదల చేసింది. అన్నమయ్య జిల్లాలో నాలుగు చోట్ల వీటిని అభివృద్ధి చేస్తున్నాము. ఒక్కొక్క నగర వనం 50హెక్టార్లలో ఏర్పాటు చేశాం. ప్రకృతి ప్రేమికులు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మహిళలు ఆనందంగా గడపొచ్చు.
-వివేక్, జిల్లా అటవీశాఖాధికారి

సంతోషంగా ఉంది



రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లెలో నగరవనాలు ఏర్పాటుచేయాలని జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషదాయకం. నగరాలకే పరిమితమైన వాటిని నియోజకవర్గ స్థాయిలోనూ ఏర్పాటుచేయడం శుభపరిణామం. ప్రజల సంక్షేమంతోపాటు మానసికోల్లాసం కోసం ప్రభుత్వం నగరవనాలు ఏర్పాటు చేస్తోంది. నగరవనం సందర్శనతో ఒత్తిడితో గడిపే వారికి ఆటవిడుపులా ఉంటుంది.
-దండుమణి, ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్, సాతుపల్లె, రాజంపేట

అందరికీ ఆటవిడుపు



అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టణ శివారు ప్రాంతంలో ఏర్పాటుచేస్తున్న నగరవనంతో ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యానికి దోహదపడుతుంది. నిత్యం పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బందులు పడుతున్నవారికి, దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడుతున్న వారికి, వాకింగ్ చేయాలనుకున్నవారికి నగరవనం చక్కని ప్రదేశం. పట్టణంలో ప్రకృతిని రూపొందించేలా ఏర్పాటుచేయనున్న నగరవనాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
-టీఎస్‌ఏ కృష్ణమూర్తి, రచయిత, మదనపల్లె

అయ్యప్పల కోసం ప్రత్యేక రైలు!

రాజంపేట/కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ ఉభయ జిల్లాల్లో అయ్యప్పల కోసం రైల్వేశాఖ శబరిమలైకు తొలిసారిగా ప్రత్యేకరైలును పట్టాలెక్కిస్తున్నారు. ఈ విషయంపై కడప, రాజంపేట ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, పీవీ మిధున్‌రెడ్డి చేసిన కృషి ఫలించింది. ఇప్పటికే అయ్యప్పలబండిగా పేరొందిన జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు రెగ్యులర్‌గా కొనసాగుతోంది. జిల్లాలో వేలాదిమంది స్వాములు వివిధ మార్గాల మీదుగా శబరిమలైకు వెళుతున్నారు. వీరి కోసం స్పెషల్‌ట్రైన్ రన్ చేయాలని రైల్వేశాఖను ఎంపీలు కోరారు.కాగా గతంలో భక్తులు రేణిగుంటకు వెళ్లి స్పెషల్‌ట్రైన్స్‌ను ఆశ్రయించేవారు.

స్పెషల్‌ట్రైన్ ఇలా..
కాచిగూడ నుంచి కొల్లం మధ్య అయ్యప్పల బండి నడిచేలా సౌత్‌సెంట్రల్ రైల్వే రూపకల్పన చేసింది. 11, 13 తేదీల్లో 07187 కాచిగూడ నుంచి కొల్లం (సోమవారం), కొల్లం నుంచి కాచిగూడ (బుధవారం)కు నడపనున్నారు. ఎర్రగుంట్ల, కడప, రాజంపేటలో ఈ స్పెషల్ ట్రైన్‌కు హాల్టింగ్ ఇచ్చారు.01787 నంబరుతో కాచిగూడ నుంచి వచ్చేటప్పుడు ఎర్రగుంట్లకు ఉదయం 9.05. కడపకు 9.39, రాజంపేటకు 10.28కు చేరుకుంటుంది. 07188 నంబరుతో శబరిమలై నుంచి వచ్చేటప్పుడు రాజంపేటకు తెల్లవారుజామున 4.38, కడపకు 5.38, ఎర్రగుంట్ల 6.13కు చేరుకుంటుంది. అయ్యప్పస్వాములు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మిధున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

క్లుప్తంగా

వడ్ల ట్రాక్టర్ బోల్తా


గంగవరం సమీపంలో పెన్నా నదిలో బోల్తా పడిన ట్రాక్టర్

కమలాపురం : మండల పరిధిలోని గంగవరం సమీపంలో ఉన్న పెన్నా నదిలో వడ్ల ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. గంగవరం గ్రామానికి చెందిన అబ్బిగాళ్ల సుబ్బరాయుడు గురువారం తన వరి చేలో కోత మిషన్ ద్వారా నూర్పిళ్లు చేయగా వచ్చిన వడ్ల గింజలను ట్రాక్టర్ల ట్రాలీలో ఆరబెట్టడానికి తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు పెన్నా నదిలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాలీలో ఉన్న రెండున్నర పుట్టి వడ్ల గింజలన్నీ నీటిపాలయ్యాయి. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రభుత్వ చౌక బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న చౌక బియ్యం బస్తాల వద్ద అధికారులు

చెన్నూరు : చెన్నూరు అరుంధతినగర్‌లో కొండు హరికృష్ణకు చెందిన రేకుల షెడ్డు వద్ద రవాణాకు సిద్ధంగా ఉంచిన ప్రభుత్వ చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్ రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం తమకు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు ఆకస్మికొంగా దాడి నిర్వహించారు. 133 ప్లాస్టిక్ సంచులలో ఉన్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వాటి బరువు 6,823 కేజీలు కాగా మొత్తం విలువ రూ. 2, 76, 333గా ఉందని తెలిపారు.హరికృష్ణతో పాటు చెన్నూరుకు చెందిన బ్రహ్మయ్య అనే వ్యక్తిపై చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీలో మంటలు

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలో స్థానిక బైపాస్ ఓవర్‌బ్రిడ్జి వద్ద షార్ట్ సర్క్యూట్‌తో లారీలో మంటలు వ్యాపించాయి. గురువారం ముద్దనూరు వైపు వస్తుండగా లారీ క్యాబిన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను అదుపు చేసింది. లారీ క్యాబిన్‌కు పూర్తిగా నష్టం వాటిల్లినట్లు సమాచారం.

చిరస్మరణీయుడు వైఎస్ జార్జిరెడ్డి

- ఘనంగా వైఎస్ జార్జిరెడ్డి వర్ధంతి
- నివాళులర్పించిన జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, డాక్టర్ ఈసీ సుగుణమ్మ


దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ తదితరులు

పులివెందుల : దివంగత వైఎస్ జార్జిరెడ్డి వైఎస్ కుటుంబంలోనే ఆణిముత్యం లాంటివారని, చిరస్మరణీయుడని జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ పేర్కొన్నారు. జార్జిరెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్ సమాధుల తోటలో దివంగత వైఎస్ జార్జిరెడ్డి సమాధికి ఆయన సతీమణి వైఎస్ భారతమ్మ, దివంగత ఈసీ గంగిరెడ్డి సతీమణి ఈసీ సుగుణమ్మ తదితర కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీఎస్ఐ పాస్టర్లు ఆనందరావు బాబు, నరేష్‌కుమార్ బాబు, మృత్యుంజయల ఆధ్వర్యంలో జ్ఞాపకార్థ ప్రార్థనలు నిర్వహించి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా భారతమ్మ మాట్లాడుతూ సౌమ్యుడిగా, మృదుస్వభావిగా, అజాతశత్రువుగా, సేవా తత్పరుడుగా, ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తిగా, మహోన్నత వ్యక్తిత్వం కలిగిన మంచి మనిషిగా జార్జిరెడ్డి పేరు తెచ్చుకున్నారన్నారు. జార్జిరెడ్డి సోదరుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజా రంజక పాలనకు, మాట తప్పని మడమ తిప్పని వ్యక్తిత్వానికి జార్జిరెడ్డి స్ఫూర్తి అన్నారు. ఈ దివంగత నేతల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కంకణబద్ధులై, రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్ బాబుకు అందరూ బాసటగా నిలిచి సంఘీభావం తెలపాలని ఆమె కోరారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ.. పేదలకు అన్నదానం

దివంగత వైఎస్ జార్జిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భాకరాపురంలోని జార్జిరెడ్డి స్మారక ఐటీఐ ఆవరణంలో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో జార్జిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి వైఎస్ భారతమ్మ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే ఐటీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జార్జిరెడ్డి చిత్ర పటానికి ఆమె పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులకు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎం కార్యాలయ కో ఆర్డినేటర్ జనార్ధన్‌రెడ్డి, వెంగమునిరెడ్డి, పార్నపల్లె నాయుడు, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపకులు ఆంజనేయులు, ఐటీఐ సాయి, రామచంద్ర, రాజగోపాల్ రెడ్డి, బ్రదర్ రఘుకర్, వేముల శ్రీనివాసరాజు, వికలాంగుల సంఘం నాయకులు వెంకట సుబ్బయ్య, సునీల్, గంగయ్య, వినయ్, బషీర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.10 లక్షలు విరాళం


కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10 లక్షలు అందిస్తున్న రాచమల్లు రమాదేవి

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని నంగనూరుపల్లె గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సతీమణి, కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రూ.10లక్షలు విరాళాన్ని అందించారు. కల్యాణ మండపానికి రూ.30 లక్షలు విరాళం ఇస్తామని గతంలో ఎమ్మెల్యే ప్రకటించారు. ఆ మేరకు రెండు విడతలుగా ఇప్పటి వరకు రూ.20లక్షలు చెల్లించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ లక్ష్మీదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ యాలం తులశమ్మ, శంకరయ్య, ఎంపీటీసీ క్రిష్టిపాటి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా అందించే సంక్షేమ పథకాలు పొందేందుకు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నాను. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అందజేశారు. గతంలో మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. మాలాంటి వృద్ధులకు జగనన్న చేసిన మేలు, నాకెంతో ఆనందంగా ఉంది.

- ఆర్.లక్ష్మీదేవి, ఇందుకూరు, వీరపునాయునిపల్లె మండలం

సొంతిల్లు నిర్మించుకున్నాను



గత పదేళ్లుగా సొంత ఇల్లు వేసుకోలేదు. గతంలో టీడీపీ వర్గీయుడిగా ఉన్నప్పటికీ సొంత ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్సార్ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరైన పక్కా గృహాన్ని నిర్మించుకుని ఇటీవల గృహ ప్రవేశం చేశాను. మా వలంటీరు ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాను. నా కుమారులతో కలసి కొత్త ఇంటిలో ఆనందంగా జీవిస్తున్నాము. సీఎం జగన్ పరిపాలన వలన మాలాంటి పేదలందరికీ మంచి జరుగుతోంది.

- పల్లె చిన్న చెన్నయ్య, పల్లవోలు, చాపాడు మండలం

హాజరు శాతం పెరిగింది



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత ప్రభుత్వ బడుల్లో విద్యా బోధన మెరుగైంది. కార్పొరేట్ తరహాలో బడులను తీర్చిదిద్దారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ట్యాబ్‌లతో విద్యాబోధన, ప్రాథమిక విద్యలోను కంప్యూటర్ శిక్షణ, అమ్మబడి తదితర పథకాలతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ బడులు గణనీయ పురోగతి సాధిస్తున్నాయి. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు విద్యాభివృద్ధికి దోహదపడ్డాయి.

-సి.చౌడయ్య, ఎంఈఓ,పెద్దముడియం రాజుపాళెం మండలం

బైకును ఢీకొన్న ట్రాక్టర్


పవన్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, బంధువులు


నాన్నకు ఏమైందని దీనంగా చూస్తున్న చిన్నారి

యువకుడు దుర్మరణం

సంబేపల్లె : మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బైకును ఢీకొనడంతో పారి పవన్ (27) అనే యువకుడు దుర్మరణం చెందిన సంఘటన సంబేపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ, యర్రగుంట్ల హరిజనవాడకు చెందిన పవన్ సొంత పనుల నిమిత్తం బైకులో రాయచోటికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో ఎదురుగా ఎర్రమట్టిలోడుతో వస్తున్న ట్రాక్టర్ పవన్ వెళ్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి పెద్దదిక్కు మృతి చెందడంతో భార్య పద్మావతి, ముగ్గురు పిల్లలు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ షరీఫ్ పరిశీలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మదనపల్లెలో..

మదనపల్లె : మద్యం మత్తులో యువకుడు బైక్‌తో కారును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలో జరిగింది. మోతీనగర్‌కు చెందిన ఫయాజ్‌అలీ కుమారుడు షేక్‌పర్వీన్ (24) పట్టణంలోని సామ్‌సంగ్ కేర్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంలో మోతీనగర్‌లో వేగంగా వెళుతూ, ఎన్వీఆర్ లేఅవుట్ సమీపంలోని ఇంటిముందు పార్క్‌చేసిన ఖదిరుల్లాఖాన్‌కు చెందిన కారును ఢీకొన్నాడు. ప్రమాదంలో పర్వీన్ తీవ్రంగా గాయపడి పొట్టపేగులు బయటకు వచ్చాయి. వెంటనే స్థానికులు యువకుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పరిశోధనలకు ప్రోత్సాహం


అంతర్జాతీయ సదస్సు ప్రారంభంలో విదేశీ ప్రొఫెసర్లు

కురబలకోట: అంతర్జాతీయ సదస్సులు నూతన పరిశోధనలకు ప్రాణవాయులా పని చేస్తాయని తైవాన్, జర్మనీ, జపాన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, యుఎస్ ప్రొఫెసర్లు పేర్కొన్నారు. ఆప్టిమైజేషన్స్ టెక్నిక్స్‌పై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభమైంది. తైవాన్ ఇన్ఫర్‌మేషన్ సైన్స్ ప్రొఫెసర్ వెన్ లియాంగ్ హ్వాంగ్ మాట్లాడుతూ వేగవంతమైన పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు ఈ సదస్సు తోడ్పడుతుందన్నారు. జర్మనీ ఈస్ట్ బవేరియన్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ టట్యానా ఇవనో వ్వా మాట్లాడుతూ పరిశ్రమలకు చెందిన పరిశోధకులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలకు వారి అప్లికేషన్లు ఒక చోట చేర్చడానికి ఈ సదస్సు నాంది అన్నారు. జపాన్ గుకుషుయిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యుకారి శిరోటా, ఆస్ట్రియా ప్రొఫెసర్ పీటర్ బర్గ్‌స్టాలర్, స్విట్జర్లాండ్ యూనివర్సిటీ అప్‌లెడ్ సైన్సెస్ ప్రొఫెసర్ సెడ్రిక్ బోర్నాండ్ మాట్లాడుతూ తాజా రచనలు, పరిశోధన ఫలితాలను ప్రదర్శించడానికి ,ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సాఫ్ట్ కంప్యూటింగ్, ఇంటిలిజెంట్ సిస్టమ్స్ తదితర వాటికి సంబంధించి వివిధ సబ్జెక్టులపై ప్రత్యేక సెషన్స్ ఉంటాయన్నారు. యుఎస్ యూనివర్సిటీ గణిత శాస్త్రవేత్త రాబర్ట్ కోజ్మా మాట్లా డుతూ ఈ సదస్సు వల్లప్రపంచంలో జరుగుతున్న పరిశోధనలను పరిచయం చేయడానికి ఉపయోగపడతాయన్నారు. టెక్నాలజీ పరంగా ప్రపంచం వేగంగా పురోగమిస్తోందన్నారు.

రేడియేటర్ నీళ్లు పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రేడియేటర్‌లోని వేడినీళ్లు ముఖంపై పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం సత్యసాయిజిల్లా తనకల్లు మండలంలో జరిగింది. మండలంలోని కొత్తపల్లెకు చెందిన ఆంజనేయులు(50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం గ్రామానికి వచ్చిన ఓ ఐషర్ వాహనం మరమ్మతుకు గురికావడంతో వాహన డ్రైవర్, క్లీనర్ రిపేరి చేసుకుంటున్నారు. ఈలోపు ఆంజనేయులు అక్కడకు వెళ్లి వారిని గమనిస్తూ, వాహన రేడియేటర్‌ను తెరిచాడు. దీంతో ఒక్కసారిగా రేడియేటర్‌లోని వేడినీరు ఆంజనేయులు ముఖం, శరీరంపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికంగా చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం గురువారం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి వీరభద్రస్వామి పశ్చిమ రాజగోపుర కుంభాభిషేకం


ప్రారంభానికి సిద్ధంగా పశ్చిమ రాజగోపురం

రాయచోటిటౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయ పశ్చిమ రాజ గోపుర కుంభాభిషేకం, సాలహార మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో శ్రీ మఠం పరమేశ్వర స్వామి వేద పండితులు, వారి శిష్యబృందం హోమాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిలు తెలిపారు. పశ్చిమ రాజగోపురం నిర్మాణం కోసం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రూ.1.58 లక్షలు నిధులు మంజూరు చేశారని చెప్పారు. అలాగే స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగేందుకు మాడవీధుల ఏర్పాటుకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల సహకారంతో మున్సిపల్ నిధుల నుంచి రూ.35లక్షలు మంజూరు చేశారని వివరించారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి హోమాలను, పూజలను విజయవంతం చేయాలని కోరారు.

రూ.150 కోట్లు ఇస్తే నా ఆస్తులు రాసిస్తా

- టీడీపీ నేతల విమర్శలపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే రాచమల్లు దంపతులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : కేవలం రూ.150 కోట్లు ఇస్తే తనతోపాటు తమ కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న ఆస్తులను టీడీపీ నేతలకు రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సవాల్ విసిరారు. గురువారం ఆయన తన సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవితో కలసి స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు అయిందన్నారు. ఇందులో రెండేళ్లు కరోనాతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మిగతా రెండున్నరేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని, చెప్పడానికి ఏమీలేని టీడీపీ మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తాను అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడి రూ.2,500 కోట్లు సంపాదించానని విమర్శిస్తున్నారన్నారు. టీడీపీ నేతలు చేసిన విమర్శలకు సమాధానం ఇచ్చేందుకే సోదరుడు, తల్లి, సతీమణితో చర్చించి ఇక్కడికి వచ్చానన్నారు. ప్రజల కోసం తన నిజాయితీని, విశ్వసనీయతను నిలుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తన తల్లిదండ్రుల సాక్షిగా, ఈశ్వరుని సాక్షిగా తాను వాస్తవాలను చెబుతున్నానని, మాట ఇస్తున్నానని తెలిపారు. టీడీపీ నేతలు ఆరోపించినట్లు తనకు రూ.150 కోట్లు చెల్లిస్తే మిగతా రూ.2,350 కోట్లు వారే తీసుకోవచ్చన్నారు. మరో వారం రోజుల పాటు ఇందుకోసం గడువు ఉంటుందన్నారు. ఇందుకు టీడీపీ నేతలు స్పందించకపోతే తన ఆస్తి రూ.150 కోట్లు లోపేనని ధ్రువీకరించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వారెడ్డి, రాజుపాళెం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్వల భాస్కర్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాచమల్లు నిరసన

ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మహ్మద్‌రఫీ విధి నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వందల మంది ప్రజలు రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చారని, అయితే జాయింట్ సబ్ రిజిస్ట్రార్ మాత్రం రాలేదన్నారు. కడప జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సమావేశానికి రత్నమ్మ వెళ్లారని, సంబంధం లేకున్నా మహ్మద్ రఫీ అక్కడికి వెళ్లారన్నారు. దీని వలన ఉదయం నుంచి వేచి ఉన్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి ఆయనను విధుల నుంచి తొలగించాలని డీఐజీకి లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.

రైలు కింద పడి ఇంటర్ విద్యార్థి మృతి




రైలు పట్టాలపై విద్యార్థి మృతదేహం, పవన్‌కుమార్ రెడ్డి ఐడీ కార్డు


కురబలకోట : మదనపల్లె పట్టణంలో ఓ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి వై.పవన్ కుమార్ రెడ్డి (17) గురువారం మధ్యాహ్నం కురబలకోట రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతి చెందాడు. ప్రమాదవశాత్తు జరిగిందా..లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. ఇతని తండ్రి వెంకట్రమణారెడ్డి మదనపల్లె పట్టణంలోని శ్రీవారినగర్‌లో చేనేత మగ్గాలు నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సంతానంలో ఇతను చిన్నవాడు. వీరి స్వగ్రామం తంబళ్లపల్లె మండలంలోని మొరుసుపల్లె బురుజు. కొన్నేళ్లుగా మదనపల్లెలో స్థిర పడ్డారు. చదువులో బాగా రాణిస్తున్న విద్యార్థి రైలుకింద ఎందుకు పడ్డాడన్నది తెలియరాలేదు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

బ్రహ్మంసాగర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య


జయదేవరెడ్డి మృతదేహం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంసాగర్‌లో దూకి గురువారం జయదేవరెడ్డి(39) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడు నీటిలో దూకిన విషయాన్ని గమనించిన పర్యాటకులు గట్టిగా కేకలు వేశారు. ఈ క్రమంలో సమీపంలో ఉన్నవారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ విద్యాసాగర్ తమ సిబ్బందితో వెళ్లి బ్రహ్మంసాగర్‌లో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రొద్దుటూరులోని గోకుల్ నగర్‌కు చెందిన జయదేవరెడ్డిగా గుర్తించారు. ఇతనికి ఇద్దరు పిల్లలు ఉండగా, బతుకుదెరువు కోసం ఆయిల్ మిల్ ఏర్పాటు చేసుకున్నాడు. అయితే భారీగా అప్పులు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

తూము షట్టర్ పడి లస్కర్‌మృతి


నీటి మడుగులో చనిపోయిన లస్కర్ బండి భాస్కర్

ఖాజీపేట : చెరువులో నీరు వృథా కాకుండా చేసిన ప్రయత్నంలో షట్టర్ మీద పడి లస్కర్ మృతి చెందాడు. వివరాలు ఇలా.. ఖాజీపేట మండలం రావులపల్లె గ్రామంలో చెరువు ఉంది. కేసీ కాలువ నుంచి వచ్చిన నీటితో చెరువును నింపారు. దీంతో చెరువు దిగువన వరి సాగుకు నీరు వదిలారు . అయితే చెరువు తూము వద్ద నీటి వృథా జరుగుతుండటం గమనించిన లస్కర్ బండి ప్రభాకర్ నీటి వృథాను అరికట్టేందుకు చెరువులోకి దిగాడు. అయితే ప్రమాదవశాత్తు తూము షట్టర్ ఊడి ప్రభాకర్‌పై పడటంతో నీటిలోనే మృతి చెందాడు. అక్కడే ఉన్న స్థానికులు అతన్ని బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. విషయం తెలుసుకున్న ఖాజీపేట ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి క్రేన్ తెప్పించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.